# అరటి పిలకలు

మూడు రోజులు ముసురు ఎట్టకేలకు విశ్రాంతి తీసుకుంది.

కలవాళ్ళు ముసురును వినోదంగా చేసుకున్నారేమోగానీ, పారమ్మ లాంటి మరో ఆధారం లేని వాళ్ళకు పూట గడవటం గగనమైపోయింది. బానిసత్వపు సంకెళ్ళను తెంపుకుని బయట పడ్డ స్వాతంత్ర సమరయోధునిలా మబ్బులను ఛేదించుకుని సూర్యుడు బయట పడుతున్నాడు. జనం మెల్ల మెల్లగా వాళ్ళ పనుల్లో ప్రవేశిస్తున్నారు,

వీధుల నిండా బురద, రోడ్డంతా బురద చెత్తాచెదారం, వేరుశనగ తొక్కలు, చిరిగిన న్యూస్ పేపర్లు, గాలికి ఎగిరొచ్చిన ఆకులు కుళ్ళిన కంపు వాటి మీద నుంచి దోమల నాట్యం!

పారమ్మకి ఆకలి మంట అధికంగా ఉంది. మూడు రోజులుగా కడుపులో ఏం పడలేదు.

ముసురు కంటే మూడు రోజుల ముందు నుంచీ ప్రారంభమైన జ్వరం పీల్చి పిప్పిచేసింది.ముసురుతో పాటే జ్వరము వదిలింది ఒంట్లో లేవటానికి సత్తువ ఉన్నపుడు ప్రక్కనే ఉన్న టీ కొట్లోంచి టీ తెప్పించుకుని తాగింది లేనపుడు కాళ్ళు కడుపులో ముడుచుకుని పడుకుంది.

ఇప్పుడు ముసురువదిలింది. జ్వరము వదిలింది వొళ్ళంతా చెమట్లు పోసాయి లేచి వీధిలోనికెళ్ళింది. కుండతో నీళ్ళు తెచ్చుకుంది. చీమ పెండలం దుంప తెచ్చుకుంది. రోజూ చేసే మసాలా శనగలకు శనగలు నానబెట్టలేదు.

ప్రతి రోజూ అరకేజీ శనగలు తెచ్చి నానబెట్టి మసాలా లో వేయిస్తుంది. పెండలం దుంపలు తెచ్చి ఉడక పెడుతుంది. శనక్కాయలు వేయిస్తుంది. వీటిన్నింటిని ఓ జంగిడిలో పెట్టి దగ్గర్లోనే ఉన్న హైస్కూలుకు ఇంటర్వెల్ టైంలో వెళ్ళి అమ్ముతుంది. ఆ పావుగంట సమయంలో అవి చెల్లిపోతాయి. అయిదో, ఆరో వస్తాయి. ఆ డబ్బులు చాలు పారమ్మ జీవనానికి ఎప్పుడయినా వంటికి రోగం వచ్చి రెక్కాడనపుడు డొక్కాడదు! ఎవరయినా కనికరించి టీ నీళ్ళు పోస్తే తాగుతుంది. లేకపోతే నీళ్ళు తాగి పడుకుంటుంది.

గబగబా తెమిలింది. పెండలం దుంపలు ఉడకపెట్టింది. వేరు శనక్కాయలు కాళాయిలో ఇసుకు పోసి, వేయించింది. వీధిలు కొచ్చింది. సూర్యుడు తీక్షణంగా ఉన్నాడు. కళ్ళకు చెయ్యి అడ్డుపెట్టి చూసింది. మరో గంటలో వెళ్ళాలి. జంగిడిలో సరుకులు సర్దుకుంది మెల్లగా నడుచుకుంటూ స్కూలుకు చేరుకుంది.

సరిగ్గా అప్పుడే ఇంటర్వెల్లు ఇచ్చారు. పిల్లలగోల ప్రారంభమయింది. అయిసు క్రీములూ, చక్కిలాలు, బిళ్ళలూ, బఠాణీలూ, గారెలూ, అమ్మకాల గోల!

"ఓలమ్మో, ఆలీసమయిపోనాను" అనుకుంటూ కాళ్ళలోలేని సత్తువను తెచ్చుకుని పరుగులాంటి నడక నడిచింది. ముందుకెళ్ళబోతుంటే అడుగులు వెనక్కుపడుతున్నాయి. వెళ్ళి రోజూ కూర్చున్న చోట కూర్చుంది.

"ఏవే! పారమ్మత్తా! ఏటావీసవయిపోనావ్?"

"ఏటి సెయిమంతావు? ముండజోరం ముసురునాగే మూడ్రోజులు పెప్పిసేసీసపినాది"

"ఏ పారమ్మ, వచ్చావా? పావలా మసాలాశనగలియ్యి " ఓ కుర్రాడు పావలా పారమ్మ చేతిలో పెట్టి అడిగాడు. మసాలా శనగలు చెయ్యాటంలో పారమ్మకి ఓ ప్రత్యేకత ఉంది. అది చేసినట్టు ఎవరూ చెయ్యలేరు కళ్ళనీరు తెప్పించే కారం వెయ్యదు. అలాగని ఉప్పుకారంలేక, చప్పగా ఉండవు. అన్నీసమపాళ్ళలో ఉండి మళ్ళీ మళ్ళీ తినాలనిపిస్తాయి పారమ్మ చేతి మసాలా శనగలు. అందుకే ప్రక్కన జంతికలూ, చైగోడీలు, అయిసులూ అమ్ముకునే వాళ్ళు సైతం పారమ్మ దగ్గర మాసాలా శనగలు కొనుక్కుతింటుంటారు. వీటిన్నిటితో పాటు పారమ్మలో చిన్న అభిమాన గుణం, జాలీ, దయా ఉన్నాయి. పిల్లలు అయిదు పైసలిచ్చి శనగలిమ్మన్నాలేదనక ఇస్తుంది. మళ్ళీ కొసరేస్తుంది. డబ్బుల్లేని వాళ్ళకు అరువిస్తుంది. డబ్బుల్లేక, ఏవీ కొనుక్కోలేని బిక్కు బిక్కు మని మొహాలు వేలేసుకునే పేదపిల్లలనిపిలిచి కాగితంలో ఇన్ని శనగలు పోసి తినమంటుంది. అందుకే పిల్లలకి పారమ్మంటే ఇష్టం పిల్లలు అరువు పెట్టి ఎవరికైనా ఎగనామం పెడతారేమోగానీ పారమ్మకు మాత్రం అలా చెయ్యరు. పైగా అయిదు పైసలో పదిపైసలో చిల్లర పారమ్మకే వదిలెస్తారు. పారమ్మని చూడగానే నాకు పదిపైసలు వియ్యి, నాకు పావలా శనగలియ్యి అని మీదని పడిపోతారు. ఎప్పట్లాగే ఆ రోజూ శనగలు కావాలని మీద పడ్డారు.

"మానాయిన్లే మాబాబులే ఈ పూటకాగండి. మద్దేనం శనగలు నానేసి రేపట్నిండీ తీసుకొత్తా, నిన్నటి దాకా ముసురు నాకు జొరం కుదర్నేదు. ఈ యేల్టికి ఏరుసెలక్కాయలూ, దుంపలూ ఒట్టుకెల్లండి" అంది పిల్లల్ని బ్రతిమాలుతూ.

వాతావరణం చల్లగా ఉండటం వల్ల పిల్లలకి కారం కారంగా శనగలు తినాలనిపించింది. అయినా పిల్లలు పారమ్మని నిరుత్సాహ పరచకుండా వేరుశనాక్కాయలూ, దుంపలు కొనుక్కెళ్తున్నారు.

ఇంటర్వెల్లు ముగిసిందిన్నట్లు మొదటి గంటకొట్టారు. ఇంతలో కొత్తగా ఆ ఊరొచ్చిన మున్సిపలు కమీషనరు పిడుగులా వచ్చి పడ్డాడు. అతణ్ని అల్లంత దూరాన చూసిన చిల్లర దుకాణాల వాళ్ళు జంగిళ్ళూ, బుట్టెలో పట్టుకుని పరుగుతీసారు.

"ఒలే, ఓని పారమ్మత్తా. నెగిసిపారిపోయే! యుముడొచ్చెత్తండు" అని ప్రక్కనే ఉన్న కొబ్బరుండలమ్మి కేకేసినా, పారమ్మకి వినిపించలేదు. కమీషనరు రానే వచ్చాడు. అక్కడున్న చిల్లర దుకాణాల వాళ్ళని చేతి కర్రతో ముణుకుల మీద కొడుతోంటే వాళ్ళు పరుగుతీస్తున్నారు.

"నువ్వేమే ఇంకా లేవ్వ? లం.... కానా? నీక్కాదాచెప్పేరి? నెగవేటి లాగేసాడు అప్పుడు చూసింది పారమ్మ కమీషనరు బాబుని వొణికి పోయింది గాలికి అల్లల్లాడిన అరిటాకులా.

"బాబ్బాబు. నీ కాళ్ళట్టుకుంటాను. మరో ఆదరపులేనిదాన్ని ఎల్లిపోతాను. నన్నొగ్గీయండి బాబూ! సచ్చినీ కడుపున పుడతాను తండ్రి తండ్రి! ప్రాధేయపడింది.

"ఏమిటీ గోల వదులు .. కాళ్ళొదులు" కమీషనరు దాన్ని విసిరి కొట్టాడు.

"వదులే ముందుకాళ్ళొదులు" జవాను కాలితో దాని డొక్కలో పొడిచి వెనక్కితోసాడు. అది వెల్లకిలా పడిపోయింది. జవానా అధికారి మెప్పుకోసం దాని జంగిడి తిరగేసాడు. వేరుశనక్కాయతో, దుంపలూ మురికి కాలువలో పడిపోయాయి ముసిల్దిలేచీ సరికి, కమీషనరూ,

జవానూ "మళ్ళీ రేపిక్కడ కనిపించావంటే నీ జంగిల్ని, నిన్నూ ఆ చెర్లోకి విసిరెస్తా జాగర్త" అని హెచ్చరిస్తూ కర్ర ఊపుకుంటూ ముందుకెళ్ళారు.

అతనా ఊరికి కొత్తగా వచ్చిన కమీషనరు, డైరెక్టుకేండిడేటు అవటం వల్ల పట్నంలో తన ప్రతాపం చూపెడుతున్నాడు. రోడ్లమీద దుకాణాలనెత్తి పారేస్తున్నాడు. రోడ్ల మీద మలమూత్ర విసర్జనలు చేసే వాళ్ళకి ఫైన్ వేస్తున్నాడు. రిక్షాస్టాండుల్లో గాక, ఎక్కడపడితే అక్కడ రిక్షాలు ఆపేవాళ్ళని అదర గొడుతున్నాడు. ఇళ్ళపన్నులూ, కుళాయి పన్నులూ, ఎగవేసిన వాళ్ళని కోర్టుకీడుస్తున్నాడు. మున్సిపాలిటీలో ఖాళీ జాగాలను ఆక్రమించి పెత్తనం చెలాయించిన వాళ్ళచే ఆస్థలాలు కాళీ చేయిస్తున్నాడు. ఎక్కడపడితే అక్కడ. కుళ్ళుకాలువల ప్రక్కన" పెంట కుప్పలమీద ప్రత్యేకమైన శ్రద్ధతీసుకోవలసిందిగా సిబ్బందికి తాఖీదులిచ్చాడు. ప్రతిరోజూ వీధులూడ్చి - మందు జల్లిస్తున్నాడు. కలరా, మశూచి వంటి వ్యాధులు రాకుండా హోటళ్ళలో మరుగు నీటిని పెట్టిస్తున్నాడు. అవినీతి మీద నిప్పులు కురిపిస్తున్నాడు. అయినా కమీషనరుకు తెలీకుండా, సిబ్బందిని సంతోష పెట్టి ఎవరిపనులు వాళ్ళు గుట్టుచప్పుడు కాకుండా చేసుకుంటునే ఉన్నారు. ఎంత నరికినా అన్యాయం అరటిపిలకల్లా పక్కనించి మొలుస్తునే ఉంది.

కమీషనరు కనిపించనంత దూరంవెళ్ళాక పిల్లలంతా చేరి పారమ్మని లేవనెత్తారు. కింద చెల్లా చెదురుగా పడిన చిల్లర డబ్బులన్నీ ఏరి, దాని జంగిల్ని సరిచేసి, జంగిట్లో ఉన్న డబ్బాలో పోసారు. సగం శనక్కాయలూ, దుంపలూ పాడయిపోయాయి.

"ముండ గండడెంత పని సేసినాడ్రా! ఆ బాబు ఇనకాలున్నాడనో ఏమో? సరుకంతా మట్టిపాలయిపోనాది. ఊ.... అమ్మా ... అబ్బా... అని మూలుక్కుంటూ లేచింది.

ఆ మర్నాడు..మూడోనాడు.... దాని వ్యాపారం జరగలేదు ఇంట్ర వెల్ కంటే ముందే కమీషనరు తిష్ఠవేసుక్కూరచోటం వల్ల దాని సరుకులు చెల్లుబాటు కాలేదు. మసాలా పెట్టిన శనగలు బూజు పట్టేసాయి వీధుల్లో అమ్ముకోటానికే కుదర్లేదు. అలాగే తన చేతుల్లోనే కాలువలో పారపోసేసింది. పారమ్మకు దిక్కుతోచలేదు తిండానికి తిండి కనిపించలేదు. ఎవరింటయినా పాచిపనులు చేసుకుందామన్న - దాని వాలకం చూసి ఎవరూ పనిలోనికి తీసుకోరు. ఇక ఒక్కటే మార్గం కనిపించింది. అది ఇంటింటకీ ముష్టెత్తుకోవటం. ఆలోచించింది. దానికి పారమ్మ మనసు అంగీకరించలేదు.

ఎన్ని కష్టాలొచ్చినా, వాటిని ఎదుర్కొని నిలవగలిగే గుండెధైర్యం పారమ్మకుంది. మనోనిబ్బరం ఉంది. ఆత్మస్థైర్యం ఉంది. చేతిలో చిల్లిగవ్వ లేకపోయినా రేపెలా జరుగుతుంది? అన్న భయం దానికేనాడూ లేదు. జీవితం ఎంతగా చిల్లులుపడినా, తల ఎంత బొప్పికట్టినా, ఆమె ఏనాడూ ఎవర్నీనిందించలేదు. రోదించలేదు. ధైర్యంగా ముందుకే నడిచింది.

అందుకే -

చిన్నప్పుడు పద్దెనిమిదేళ్ళ వయసులో ఉన్నప్పుడు నల్లగా ఉన్నా పారమ్మ అందంగా ఉండేది. బిగువయిన శరీరం. అవయవాలపొందిక, చేరడేసికళ్ళు పెద్దకొప్పు, పొడవైన మనిషి వీటికి తోడు నవ్వితే ముత్యాల్లా తళుక్కుమనే పలువరుస! అందర్నీ ఎంతగానో ఆకర్షించేది. పారమ్మతో

కోడెగాళ్ళ పనిగట్టుకుని మాట్లాడేవాళ్ళు. అదే మాత్రం తండ్రికి ఇష్టపడేదికాదు. అందుక్కారణం లేకపోలేదు. పారమ్మ తల్లి మొదట్లో మొగుణ్ణొదిలి అప్పటికీ పుట్టిన పారమ్మతో మరో మగాడితో లేచిపోయివచ్చింది. అతరువాత పారమ్మ తల్లికి ఆడపిల్లలు పుట్టినా వాళ్ళంత అందమైన వాళ్ళు కారు ఆ అక్కసు పారమ్మ తండ్రిలో ఉండి చీటికీ మాటికీ చీదరించుకోవటం కొట్టడం చేసేవాడు. మంచి సంబంధాలు పైసా అక్కర్లేకుండా పారమ్మని చేసుకుంటామని ముందు కొచ్చినా, పారమ్మ (రెండో) తండ్రి కానిచ్చేవాడుకాదు చివరికో కన్నూ ముక్కూ తీరులేనివాడూ, తారులా తళతళ్లా మెరిసిపోయేవాడు, చేసుకుంటానని రాగానే మారు మాటడకుండా ఒప్పేసుకుని వచ్చి భార్యకు చెప్పాడు. పారమ్మకు జరుగుతోన్న అన్యాయం తల్లికి తెలిసినా, భర్తని ఎదిరించ లేకపోయింది. పారమ్మ దగ్గర ఏడ్చింది పారమ్మే తల్లికి ధైర్యం చెప్పింది. 'అందం కొరుక్కుతింటామా' అంది.

అలాగే ఓ అనాకారికి భార్య అయిన పారమ్మ అతని రూపానికి మనసే మాత్రం తక్కువ కాదని తెలుసుకుంది. వీధులో కెళ్ళి ఇంట్లోకి తిరిగొస్తే 'ఎవడి దగ్గర కెళ్ళొచ్చావే? ఎవడి పక్కలో తొంగోనొచ్చావే? సీరేటీ ఇలానలిగిపోనాదీ?' అని నానా చెత్త ప్రశ్నలూ వేసేవాడు పారమ్మ మవునంగా ఉండిపోయేది. " అవునే ఆడన్న దాన్లో యతార్తం ఉంది కాబట్టేనువు ఒల్లకూన్నావే" అని అత్త బుగ్గలు పొడిచేది. మొత్తేది ఒకసారి ఇరుగు పొరుగువాళ్ళు పారమ్మ మొగుడ్నీ, అత్తనీ చీవాట్లే సారు పారమ్మ చాలా బుద్ధిమంతురాలన్నిరు. ఆ తరువాత పారమ్మ మొగుడు తాగొచ్చి, ఏదో నెపంతోచితకబాదేవాడు.

అయినా -

తన కడుపున ఓ నలుసు పుడితే వాణ్ణి చూసుకునైనా తృప్తిగా జీవించాలనుకుంది. కానీ ఎన్నాళ్ళయినా పారమ్మ కోరిక నెరవేరలేదు. పారమ్మ మొగుడూ, అత్తమామలు, ఆడబొడుచులూ, ఏకమయారు 'గొడ్రాలి ముండా! తెల్లారి లేచి నీ ముఖం చూస్తే పాపమే" అని ఇంట్లోంచితగిలేసారు. పారమ్మ మొగుడికి మళ్ళీ పెళ్ళి చేసారు.

పారమ్మని మనోవర్తి కోరుకొమ్మని, పంచాయితీ పెట్టించమని ఇరుగు పొరుగులు సలహా ఇచ్చారు. పారమ్మ అందుకు ఇష్టపళ్ళేదు. తనలో శక్తి ఉంది. తన కాళ్ళ మీద తను నిలబడగలనంది. అందుకే విడాకులూ తీసుకోలేదు. ఇష్టం లేదని మొగుడు పామ్మని గెంటెస్తే కట్టుగుడ్డలతో ఇల్లు వదిలి వచ్చేసింది. పుట్టింటికీ వెళ్ళలేదు.

కొన్నాళ్ళు పొలం పనుల కెళ్ళేది అయితే అక్కడా పారమ్మకి కొన్ని ఇబ్బందులు ఎదురయేవి. తలదువ్వుకోకపోయినా, అలంకరించుకోపోయినా, చిరిగిన చీరకట్టుకున్నా - కొందరి కళ్ళకామె బాగానే కనిపించేది. కన్ను కొట్టేవారు చెయ్యి పట్టుకునే వారు. ప్రక్కకి పిలిచేవారు సందు దొరికితే సరసానికి రమ్మనేవారు.

కానీ పారమ్మకి మనసు చచ్చిపోయింది. దానికెలాటి కోరికలూ లేవు. మరో సారి మోసపోడానికి ఇష్టపళ్ళేదు ఓ రోజు పొలం పనుల్లో పారమ్మ సవితి కనిపించింది ఏదో అడగాలని పారమ్మ పిల్లలా? ' అంది. "ఇద్దరు కొడుకులూ.. ఒక బోట్టె" అంది. అన్నా తరువాత "ఒలే అప్పా

నీ లాటి సత్తెకాలపు ఆడదాయి బతకనం కట్టమే" అంది ఆ తరువాత చెవిలో ఏదో చెప్పింది. "నువ్వూనానాగ తెగించి ఉంటే నీ కడుపునా బిడ్డలు పుట్టీవారనీ, నీ బతుకిట్టా గయ్యేదికాదని " ఆ మాటలు విన్న పారమ్మ నవ్వుకుంది. ఆ తరువాత కొన్నాళ్ళకి కలిసి "ఇద్దరం కలిసి ఉందాం. మొగణ్ని ఒప్పిస్తాను" వచ్చిసుంది పారమ్మ అంగీకరించలేదు. పారమ్మనెలుగుడూ బతికులాడాడు పారమ్మ వినలేదు.

అక్కణ్నుంచీ ఏదో పని చూసుకుని బతుకు వెళ్ళబుచ్చేది తల్లి తనవల్లే పారమ్మ బతుకలా అయిపోయిందని ఏడిస్తే దెబ్బలాడేది పారమ్మ ఇపుడు పారమ్మ కనిపిస్తున్నంత ముసలి వయసుది కాకపోయినా నడుం వంగి పోయింది. చర్మం వేలాడిపోయింది. చూపు మందగించింది. గొంతులో ఒణుకు వచ్చింది. నోట్లో పళ్ళూ కొన్నే మిగిలాయి. కష్టపడి పని చేయలేకపోతోంది. వృద్ధాప్యపు పించను కోసం వెళ్తే ఎవరూ లేరని ధ్రువపత్రం సంపాదించాలన్నారు. ' నీ భర్త ఉండగా, లేదని ఎలా పింఛన్ ఇవ్వమంటావ్? అన్నాడు గ్రామాధికారి.

ఇలాంటి సమస్యలతో ఆ ఆశవదులుకుంది. స్కూలు పిల్లలకి మసాలా శనగలమ్మకుని బ్రతుకు సాగిస్తోంది.

ఇంతలో -

కొత్త కమీషనరు రాక, పారమ్మ బతుక్కి ఆ మాత్రపు ఆదరవూ లేకుండా చేసింది. రెండు, మూడు రోజులు గడిచాయి. మళ్ళీ జ్వరం శరీరంలో దొంగలా ప్రవేశించింది. వొళ్ళంతా ఒణుకు, తలుపేసుకుని కుక్కి మంచంలో కాళ్ళు ముడుచుకుని పడుకుండిపోయింది.

పారమ్మ ఏమయిందీ ఎవరికీ పట్టలేదు. పారమ్మకి ఆకలి అధికమైంది. దాహంతో గొంతెండిపోతోంది. లేచి నీళ్ళు తాగటానికి ఓపిక లేకుండాపోయింది. కుండ దగ్గర కెళ్ళి, గ్లాసులోనికి నీళ్ళు పోసుకుని తాగాలను కుంటోంది. లేవటానికి అవయవాలేవీ సహకరించటం లేదు. ఊపిరి తియ్యటాం కూడా కొంత సేపటికి భారమైపోయింది. ఓ నడిరేయి ఆపనీమానేసింది.

ఆ తరువాత కొత్త కమీషనరు పాతయాడు అతనిపల్సుని ఆ ఊరిపెద్దలు పట్టేసారు డబ్బువిలువని అతని భార్యామణి ద్వారా అతనికి బోధించారు. అతణ్ణి స్థితి పరుణ్ణి చేసారు.

మళ్ళీ అంతా మామూలే!

రోడ్ల మీద ఎక్కడపడితే అక్కడే దుకాణాలు కూరగంపలు మున్సిపాల్టీ స్థల దురాక్రమణలు పన్నుల ఎగవేతలు, రాయితీలు, తగ్గింపులు. ఆఫీసులో గుమస్తాల శేషసాన్నులు. బాతాఖానీలు సూళ్ళ దగ్గర మురికి కాలవల దగ్గర చిల్లర దుకాణాలు

అన్నీ మామూలే!

అక్కడ - ఆ స్కూలు ఆవరణలో మళ్ళీ కనిపించనిది మాత్రం పారమ్మే!

(20-11-1994 ఈనాడు, ఆదివారం సంచిక)

❀ ❀ ❀ ❀